అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
ఆదివారం 6, ఏప్రిల్ 2025 | సంపుటి :02 | సంచిక :50

# అక్రమార్కులకు కాసుల వర్షం!

## అందర్ బాహార్ పేకాట నిర్వహణకు పక్కా ప్లాను, పకడ్బందీ నెట్ వర్క్

అందర్ బాహర్ (కోస) పేకాట వరంగల్ జిల్లాలో అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తుంది. విస్తుపోయే రీతిలో ఆదాయం సమకూర్చుతుంది. అందర్ బాహర్ పేకాటకు అనుమతి ఇస్తున్నందుకు కొందరు పోలీసులు అందిన కాడికి దండుకుంటుండగా ఈ ఆట నిర్వహణలో భాగస్వాములు అవుతున్న ప్రైవేటు వ్యక్తులు కూడా ఫిక్స్ డ్ అమౌంటు పొందుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా నిర్వాహకులు పక్కా ప్రణాళిక, పకడ్బందీ నెట్ వర్క్ తో అందర్ బాహర్ పేకాట కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆటలో పాల్గొనే వ్యక్తుల రాకపోకల కోసం ప్రత్యేక వాహనాలను సమకూర్చుతున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ ఆట నిర్వహణలో బ్రోకర్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు సమాచారం. పేకాటరాయుళ్లను తీసుకొచ్చే బ్రోకర్లకు నిర్దేశిత అమౌంటు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఆట సజావుగా సాగేందుకు ఎస్కార్ట్, సెంట్రీ, పెట్రోలింగ్ విధుల నిర్వహణ కోసం ఓ బృందాన్ని నియమించుకున్నట్లు సమాచారం. తమకు దన్నుగా నిలుస్తున్న వీరందరికీ రోజువారీ చెల్లింపులు జరుగుతుండటం విశేషం.

– అక్షరదర్బార్, వరంగల్

- ఆటకు అనుమతి ఇస్తున్న కొందరు పోలీసులకు ఫిక్స్ డ్ అమౌంట్
- ఈ పేకాటలో పాల్గొనే వ్యక్తులకు స్పెషల్ వెహికల్స్ ఏర్పాటు
- పేకాటరాయుళ్ల కోసం బ్రోకర్ వ్యవస్థ అమలు
- ఎస్కార్ట్, సెంట్రీ, పెట్రోలింగ్ విధులకు ప్రత్యేక బృందం
- దన్నుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ రోజువారీ చెల్లింపులు

### పేకాటరాయుళ్లను తీసుకొస్తే

ఈ పేకాట నిర్వహణలో బ్రోకర్ వ్యవస్థ అమలవుతున్నట్లు తెలిసింది. పేకాటరాయుళ్లను ఇక్కడికి అందర్ బాహర్ పేకాటలో పాల్గొనేందుకు తీసుకువచ్చినందుకు నిర్వాహకులు బ్రోకర్లకు రోజువారి ఫిక్స్ డ్ అమౌంట్ చెల్లిస్తున్నట్లు తెలిసింది. గేమ్ ఆడే వారిని ఇద్దరిని తీసుకొస్తే రూ.3000, ముగ్గురిని తీసుకొస్తే రూ.4000 చొప్పున బ్రోకర్లకు చెల్లింపులు జరుపుతున్నట్లు సమాచారం. వరంగల్ అడ్తీ వ్యాపారి నర్సంపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి ఈ పేకాట నిర్వహిస్తున్నారని, నర్సంపేటకు చెందిన వారిలో ఒకరు ఈ ఆట నిర్వహణ కోసం సహకరిస్తున్న పోలీసులతో డీల్ మాట్లాడినట్లు తెలుస్తోంది.



అందర్ బాహార్

వరంగల్ జిల్లాలోని ఓ మండలంలో జోరుగా పేకాట

- మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆట షురూ
- రోజు ఆట ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లింపులు
- తమ పరిధిలో పేకాట నిర్వహణకు కొందరు పోలీసుల హెల్ప్!
- ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా ముందు జాగ్రత్తలు

2లో..

ఆన్ లైన్ గేమ్ లు, బెట్టింగులు అనేకమందిని బలి తీసుకుంటున్నాయి. సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలామంది ఆన్ లైన్ గేమ్ లు, బెట్టింగుల్లో పాల్గొని పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుంటున్నారు. ఆన్ లైన్ గేమ్ లు, బెట్టింగ్ ల కోసం చేసిన అప్పు తీర్చలేని స్థితిలో కొందరు ఊపిరి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆన్ లైన్ గేమ్ లు, బెట్టింగ్ లను ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. బెట్టింగ్ ల నియంత్రణ కోసం కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ అధికారులతో సిట్ ను కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాన్ని అమల్లో పెట్టేందుకు ఆన్లైన్ గేమ్లు బెట్టింగ్ లపై పోలీసు ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపే దిశగా ముందుకు వెళ్తుంటే క్షేత్రస్థాయిలోని కొందరు పోలీసులు తమ స్వప్రయోజనాలే లక్ష్యంగా భావిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుండగా గేమ్ లు సీక్రెట్ గా కొనసాగుతున్నట్లు కనబడుతుంది.





### కొందరు పోలీసులకు..

కొందరు పోలీసుల అనుమతితోనే అందర్ బాహర్ పేకాట ఈ మండలంలో సాగుతున్నట్లు తెలిసింది. ఈ ఆట నిర్వహణకు అనుమతి ఇస్తున్న ఓ అధికారికి రూ.20000, ఆయన సిబ్బందిలో ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రోజువారీగా అందుతున్నట్లు ప్రచారంలో ఉంది. అంతేకాదు ఓ నిఘా విభాగంలోని కొందరు సిబ్బందికి కూడా రోజుకి రూ.5000 చొప్పున ఈ ఆట నిర్వాహకుల నుంచి అందుతున్నట్లు టాక్. గతంలో వారంవారీగా జరిగిన ఈ చెల్లింపులు తాజాగా రోజువారీగా జరుగుతున్నట్లు సమాచారం. అప్పుడప్పుడు ఈ ఆట నిర్వాహకులు ఏదో ఒక రోజు వరంగల్ జిల్లాలోని మరో మూడు మండలాల్లో కూడా పండ్ల తోటల్లో రాత్రి వేళ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. రేపటి సంచికలో మరిన్ని వివరాలు..

మరిన్ని వివరాలు రేపటి సంచికలో..

### 8 మందితో స్పెషల్ టీం

ఏజెన్సీ గ్రామాలు కలిగి ఉన్న వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ లోని ఓ మండలంలో అందర్ బాహర్ పేకాట ఇటీవలి కాలంగా కొనసాగుతుండటంపై శనివారం 'అక్షరదర్బార్' పత్రికలో 'అందర్ బాహర్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కొందరు పోలీసుల సహకారంతో ఈ ఆట నడుస్తున్న వైనం ఈ కథనం ద్వారా వెలుగులోకి రావడం సంచలనం రేపింది. అయితే ఈ ఆట సాగుతున్న హైవేపై గల ఈ మండలంలో అందర్ బాహర్ పేకాట నిర్వహణకు నేతృత్వం వహిస్తున్న వరంగల్ వరంగల్ ఏకశిలనగర్ లోని అడ్తీ వ్యాపారి పక్కా ప్రణాళిక, పకడ్బందీ ఏర్పాట్లతో ముందుకు వెళ్తున్నట్లు తెలిసింది. అందర్ బాహర్ పేకాట నిర్వహణ కోసం సదరు నిర్వాహకుడు 8 మందితో ఒక ప్రత్యేక టీం నియమించుకున్నట్లు సమాచారం. ఈ టీములోని సభ్యుల్లో ఇద్దరు పేకాట వద్ద కార్డుల పంపిణీ, ముగ్గురు చుట్టుపక్కల సెంట్రీ విధులు, మరో ముగ్గురు రహదారులపై మండల కేంద్రం వరకు బైకుల ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజు రెండు నుంచి మూడు గంటల పాటు విధులు నిర్వహించే వీరిలో ఒక్కొక్కరికి రోజుకు రూ.3 వేల చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఈ పేకాటలో పాల్గొనే వ్యక్తుల కోసం నర్సంపేట, వరంగల్, జనగామ తదితర ప్రాంతాల నుంచి రోజు 10 నుంచి 12 కార్లను సమకూరుస్తున్నారని, వీటిలో ఒక్కో కారుకు అద్దె రోజుకు రూ.5 వేలు చెల్లిస్తున్నారని సమాచారం.

